నడుచుకుంటూ వెళ్తూ కుప్పకూలి మృతి



సీపీఆర్ చేసినా కాపాడుకోలేకపోయిన స్థానికులు

అంబర్‌పేట: గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తూ కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు, పోలీసులు అతనికి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. చే-నంబర్ చౌరస్తాలో గుర్తుతెలియని వ్యక్తి (35) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కళాకారులను ప్రోత్సహించడం మన బాధ్యత

టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



కళాకారులను సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, లంక లక్ష్మీనారాయణ తదితరులు

చిక్కడపల్లి: కళాకారులను ప్రోత్సహించడం మన అందరి బాధ్యతని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. గురువారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సిటీ కల్చరల్ సెంటర్‌లో సెవెన్‌హిల్స్, సినీ డబ్బింగ్ ట్రైనర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.ఏడు కొండల్‌రావు ఆధ్వర్యంలో శివనంది అవార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కవులు, రచయితలను గౌరవిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని అన్నారు. సెవెన్‌హిల్స్ సినీ గీతాల కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రావు, వడ్ల కొండ వెంకట్‌రావు, ఫేమస్ ఎమో ఆర్టిస్ట్ పద్మావతి, సిటీ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పురుషోత్తంరావు, మోటివేషన్ స్పీకర్ రజని, రమ, సీనియర్ మిమిక్రీ ఆర్టిస్ట్ సుబ్రమణ్యం, ఐవీఐఫ్ నాయకులు నరేష్‌గుప్తా, శ్రీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'తీన్మార్ మల్లన్న కాదు.. చిల్లర మల్లన్న'

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచి అదే పార్టీ నాయకులను దూషిస్తున్న తీన్మార్ మల్లన్నకు పార్టీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు గూడూరు నిఖిల్‌రెడ్డి పార్టీ అధిష్టానాన్ని కోరారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన వీడియోలు అన్ని ఆధారాలతో సహా త్వరలోనే ఢిల్లీ ఏఐసీసీకి పంపుతామని, ఇతనిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న నాగుపాము లాంటి వాడని అతన్ని ఎవ్వరూ నమ్మరాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వారి చమటోడ్చి ఎమ్మెల్సీగా గెలిపిస్తే కాంగ్రెస్ సీనియర్ నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాడన్నారు. ఎన్నికలకు ముందు పార్టీని, పార్టీ నాయకులను ఎంతో పొగిడిన మల్లన్న ఇప్పుడు చిల్లర మల్లన్నగా మారాడన్నారు. మల్లన్న ఒక ఊసరవెల్లి అని అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకునే రకమని, ఇతడిపై పార్టీ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ కులగణనను వ్యతిరేకించే పార్టీలు బీసీ ద్రోహులే..

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: బీసీ కులగణనను వ్యతిరేకించే పార్టీలు బీసీ ద్రోహులేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. తెలంగాణలో సమగ్ర కులగణన సర్వే ప్రారంభమైనందున సర్వేలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం కాచిగూడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారి తెలంగాణలో సమగ్ర కులగణన జరుగుతోందన్నారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ లాగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

◆ కులగణనలో ఆయా పార్టీలు భాగస్వామ్యం కావాలని, లేని పక్షంలో ఆపార్టీలు బీసీ ద్రోహుల పార్టీలుగా ప్రకటించాల్సి ఉంటుందన్నారు. కులగణన జీవో విడుదలై సమగ్ర కులగణన సర్వే ప్రారంభమైనా ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రాష్ట్ర అధ్యక్షులు కేసీఆర్, కిషన్‌రెడ్డి కులగణనపై మాట్లాడకుండా ఎన్ని రోజులు మౌనం వహిస్తారని అన్నారు. కులగణనకు అనుకూలమా? వ్యతిరేకమా? ఏదో ఒకటి తమ విధాన నిర్ణయాన్ని ఆయా పార్టీలు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేష్, మురళీకృష్ణ, పండరినాథ్, సూర్యనారాయణ, జానయ్య, పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

సమాజసేవలోనే నిజమైన ఆనందం

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్



ఎద్మాకమలాకర్‌కు బాధ్యతలను అప్పగిస్తున్న డా. కోటేశ్వర్‌రావు, డా.మహేంద్రకుమార్

చిక్కడపల్లి: సమాజ సేవలోనే నిజమైన ఆనందముందని నవభారత లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. గురువారం అశోక్‌నగర్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు.ఇటీవల సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ లయన్స్ సమావేశంలో అధ్యక్షురాలిగా హిప్నో పద్మాకమలాకర్, ప్రధాన కార్యదర్శిగా బి.వనిత,కోశాధికారిగా కె.శోభారాణి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ 320ఎ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.కోటేశ్వర్‌రావు, 1వ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, ప్రతినిధులు ఘోపాలకృష్ణ, రామప్రసాద్, మోహన్‌దాస్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించాలి



కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజా ఐక్య పోరాటాల నిర్మాణం ద్వారానే ఫాసిజాన్ని ఎదుర్కోగలమని కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ జాతీయ కన్వీనర్లు మంగత్‌రాం పాస్లా, మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మతం అనేది వందలాది సంవత్సరాల నుంచి ఉన్నది కాదన్నారు. రాజకీయ అధికారం కోసం కులం, మతం అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. దేశంలో ప్రజాస్వామిక హక్కుల కాలరాస్తూ జైలు నిర్బంధంతో ప్రశ్నించే గొంతుకులను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, గుర్రం విజయ్‌కుమార్, మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామచంద్రన్, రెడ్‌స్టార్ జాతీయ కన్వీనర్ కార్యదర్శి పీజే జేమ్స్, వివిధ పార్టీ నేతలు కె. గోవర్ధన్, ఎంఎస్ జయకుమార్, జానకీరాములు, గోవిందరాజు, గంగాధరన్, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వి.తుకారం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మా లక్ష్యం.. సమస్యల పరిష్కారం

ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు

- ప్రభుత్వ భూముల పరిరక్షణకు గట్టి చర్యలు
- దళారీ వ్యవస్థకు చెక్ పెడతాం
- సాక్షితో సికింద్రాబాద్ నూతన ఆర్డీఓ సాయిరామ్



బన్సీలాల్‌పేట్: ''రెవెన్యూ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు సమస్యల పరిష్కారానికి సకాలంలో చర్యలు తీసుకుంటా.. ప్రభుత్వం పేదల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయంలో నిర్దిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతాం'' అని సికింద్రాబాద్ నూతన ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన పి.సాయిరామ్ చెప్పారు. ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన సాయిరామ్ సాక్షితో పలు విషయాలను వెల్లడించారు. రెవెన్యూ పరమైన సేవల విషయంలో ఎలాంటి సమస్యలున్నా ప్రజలు నేరుగా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

సకాలంలో సర్టిఫికెట్లు అందజేస్తాం

సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సికింద్రాబాద్, మారేడ్‌పల్లి, తిరుమలగిరి, అమీర్‌పేట్, షేక్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాలున్నాయి. పేదలకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలతో పాటు ఇళ్ల పట్టాల పంపిణీ అలాట్‌మెంట్ కూడా చేస్తున్నాము. ప్రజలకు కావలసిన కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేస్తున్నాము. అలాగే అర్హులైన పేదలకు సకాలంలో పెన్షన్లు అందజేస్తున్నాము. సికింద్రాబాద్ రెవెన్యూ పరిధిలో మొత్తం 6,624 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరితోపాటు అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్న వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పెన్షన్లు అందజేస్తున్నాము.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాము. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)లు ప్రతి వారం ప్రభుత్వ స్థలాన్ని తనిఖీ చేసి కబ్జాకాకుండా తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తారు. సికింద్రాబాద్ రెవెన్యూ పరిధిలో లక్షా 44వేల చదరపు మీటర్ల ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ భూములను గుర్తించి స్థలం చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అక్కడ బోర్డులను ఏర్పాటు చేశాము. ప్రభుత్వ భూములను అక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాము. కేసుల్లో ఉన్న భూములపై న్యాయపోరాటం చేస్తూ వాటిని స్వాధీనం చేసుకుంటున్నాము.

సీనియర్ సిటిజన్స్‌ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటాం

సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాము. కన్న పిల్లలు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తూ వారి బాగోగులు పట్టించుకోకుంటే సదరు వ్యక్తులపై చట్టపరమైనచర్యలు తీసుకుంటాము. చట్టపరంగా సీనియర్ సిటిజన్స్‌కు అనేక హక్కులుంటాయి. వారి ఆస్తిని బలవంతంగా తీసుకున్నా, సంతకాలను ఫోర్జరీ చేసినా చర్యలు తప్పవన్నారు. సీనియర్ సిటీజన్స్ దరఖాస్తు చేసిన వెంటనే చట్టపరిధిలో న్యాయంచేస్తున్నాము. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఉండే పిల్లల నుంచి వారికి ప్రతి నెలా మెంటినెన్స్ కోసం రూ. 10వేల ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాము.

ఎప్పటికప్పుడు ఫైల్స్ క్లియర్ చేస్తాం

ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ పరమైన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాము. సమయ పాలన అంటూ లేకుండా ఫిర్యాదులను స్వీకరిస్తున్నాము. రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాము. టేబుల్‌పై ఒక్క ఫైల్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నాము.

దళారీ వ్యవస్థకు చెక్

రెవెన్యూ పరమైన సేవల్లో దళారీ వ్యవస్థకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాము. ప్రజలు నేరుగా వచ్చి ఆయా పథకాలు, సేవల కోసం దరఖాస్తు చేసుకుంటే వెంటనే పరిష్కరిస్తాము. దళారుల మాయమాటలు నమ్మి వారికి డబ్బులు చెల్లించి ప్రజలు మోసపోరాదు. నేరుగా అధికారుల వద్దకు వచ్చి పనులు చేయించుకోవాలని సూచన.

ఇంద్రసేన్‌రెడ్డికి నివాళి

నల్లకుంట: స్వామి వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నల్లకుంటలో మాజీ ఎమ్మెల్సీ దివంగత ఎస్.ఇంద్రసేన్‌రెడ్డికి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర రావు ఇంద్రసేన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద కేంద్రం ప్రతినిధులు రంగాచార్యులు, పతంజలి సత్యనారాయణ, వినయ్, కాంగ్రెస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: నింబోలిఅడ్డ ప్రధాన రహదారిపై డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. గురువారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ స్థానిక ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి అధికారులతో మాట్లాడి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఆర్. సంతోష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, శ్రీను, పండిత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు సరఫరా చేస్తున్న వ్యక్తిపై కేసు

కాచిగూడ: నకిలీ తల వెంట్రుకల మందును సరఫరా చేస్తున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ముంబైకి చెందిన సంస్థ నకిలీ తల వెంట్రుకల మందును తయారు చేస్తోంది. దీనిని బెంగళూర్‌కు చెందిన మరో సంస్థ తయారు చేసి బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన పుక్‌రాజ్ (50)కి సరఫరా చేస్తోంది. దీనిని అతను మందుల దుకాణాలకు విక్రయిస్తున్నాడు. ముంబై సంస్థ ప్రతినిధి ఫిర్యాదు మేరకు పుక్‌రాజ్‌పై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో సెల్‌ఫోన్, బంగారు రింగులు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైన సంఘటనలో కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మన్‌మాడ్ రైల్వే స్టేషన్ వద్ద ఓ మహిళ అంబికా (32) అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు బాసరాకు రాగానే బ్యాగు కనిపించలేదు. బ్యాగులో రెండు 10 గ్రాముల బంగారు రింగులు, ఒక సెల్‌ఫోన్, రూ.10వేల నగదు ఉంది. కాచిగూడ రైల్వే పోలీసులకు గురువారం బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

సెల్‌ఫోన్, నగదు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైన సంఘటనలో కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... శివరాంపల్లికి చెందిన శోభ (49) మహారాష్ట్రలోని మల్కాపూర్ నుంచి రైల్లో కాచిగూడకు వస్తోంది. రైలు ముత్కేడ్‌కు రాగానే చూసుకునే సరికి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో ఒక సెల్‌ఫోన్, రూ.20వేల నగదు ఉంది. బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ ఫామ్‌లను అందజేస్తున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో బీజేపీ సాధారణ సభ్యత్వ, క్రియాశీల సభ్యత్వ దరఖాస్తులను పార్టీ నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక మంది బీజేపీ సభ్యత్వాన్ని తీసుకోవడం కోసం ముందుకు రావడం ఎంతో గర్వకారణమని అన్నారు. బీజేపీని బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, సి.నందకిషోర్ యాదవ్, శ్యామ్‌రాజ్, రమేష్‌యాదవ్, యశ్వంత్, వనం రమేష్, నాగభూషణం, రవీందర్‌గౌడ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లో-ప్రెషర్ సమస్యను పరిష్కరించాలి



దప్పుఎల్లయ్య బస్తీలో వాటర్‌వార్క్స్ అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని దప్పు ఎల్లయ్య బస్తీలో లో-ప్రెషర్ సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ పావని అన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం డివిజన్‌లోని దప్పుఎల్లయ్య బస్తీలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, వాటర్‌వార్క్స్ డిప్యూటీ జీఎం కార్తీక్‌రెడ్డిలతో ఆమె కలసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో కాకుండా అనేక ఏరియాలలో లో-ప్రెషర్ సమస్యలేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా డివిజన్‌లో అనేక బస్తీలలో కలుషిత నీరు కూడా సరఫరా అవుతుందని రాకుండా చర్యలు తీసుకుని ప్రజల, బస్తీ వాసుల ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వార్క్స్ మేనేజర్ శ్రీధర్, బీజేపీ నేతలు ఉమేష్, బాలకృష్ణ, రాజయ్య, బస్తీవాసులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శప్రాయుడు

శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: భారతదేశంలో చరకుడు వైద్యశాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేసినా అవి ప్రాచుర్యంలోకి రాకపోవటం దురదృష్టకరమని శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అదే కోవలో ఎల్లాప్రగడ సుబ్బారావు వైద్యశాస్త్రంలో పలు రుగ్మతలకు పరిశోధనలు చేసినా ఆయనకు రావాల్సినంత గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో డా. యల్లాప్రగడ సుబ్బారావు యాదిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డా. యల్లాప్రగడ సుబ్బారావు వివిధ రసాయనాలు సమ్మేళనాలతో ప్రయోగాలు చేసి ఫోలిక్ ఆమ్లం కనిపెట్టారని గుర్తుచేశారు. ఇది రక్తంలోని హిమోగ్లోబిన్ క్షీణతను అరికట్టడానికి దోహదపడుతుందని తెలిపారు. సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. ఎల్లాప్రగడ సుబ్బారావు తెలుగు వారు కావటం మనకు గర్వకారణమని అన్నారు. టీబీ, డయేరియా వంటి రోగాలకు చికిత్స విధానం కనిపెట్టినా ఆయన పేరు ప్రఖ్యాతులు రాకపోవడం బాధాకరమని అన్నారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టినా అభ్యుదయ భావాలతో మూఢచారాలను వ్యతిరేకించారని వివరించారు. యువకళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రచారాలకు దూరంగా ఉన్నా ఎల్లాప్రగడ సుబ్బారావు ఆదర్శప్రాయుడని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో గరిమెళ్ళ సీత పాల్గొన్నారు.



ఎల్లాప్రగడ సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న సిరికొండ మధుసూదనాచారి, పొత్తూరి సుబ్బారావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. బర్కత్‌పుర ఫీడర్ పరిధిలో బర్కత్‌పుర, పద్మకాలనీ, శంకర్‌మఠ్ వెజిటేబుల్ మార్కెట్ తదితర ప్రాంతాలలో 10గంటల నుంచి ఒంటిగంట వరకు, ఆప్కో ఫీడర్ పరిధిలోని విఠల్‌వాడీ, నారాయణగూడ వాటర్ వర్క్స్, కెనరాబ్యాంక్, శాంతి థియేటర్, తెలుగు అకాడమీ, తెలంగాణ టూరిజం తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు మెగా జాబ్ మేళా

కాచిగూడ: రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన నారాయణగూడలోని కళాశాల ప్రాంగణంలో మేగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సంయుక్త ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సేల్స్, మార్కెటింగ్, ఫార్మా తదితర రంగాలకు చెందిన 40కి పైగా వివిధ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

10న భార్యాబాధితుల సంఘం సదస్సు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 10వ తేదీన భార్యాబాధితుల సంఘం కోర్‌కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి. బాలచంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సమావేశం ఉంటుందని బాధితులంతా పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమాజంలో మానవ హక్కులు కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాల చట్టాలలో మార్పులు తెచ్చినప్పటికీ మహిళల వల్ల అనేక మంది పురుషులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ప్రభుత్వ చట్టాలను దుర్వినియోగం చేస్తూ పురుషుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు తెలంగాణ వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు నవంబర్ 15వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్‌స్టాక్ డెవలపర్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్ వంటి 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికెషన్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్‌లైన్‌లో [illegible] వెబ్ సైట్‌లో లేదా ఫోన్ నం.95058 00050, 95058 00047లో సంప్రదించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే పర్మనెంట్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికులు ఏళ్ల తరబడి చాలీ చాలని జీతాలతో పనిచేస్తూ అర్ధాకలితో అలమటిస్తూ జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కులం, మతం లేనివారికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణనలో ఏ కులము, ఏ మతము పాటించని వారిని కూడా లెక్కించాలని మతం, కులం లేని వారిని లెక్కించేందుకు ప్రస్తుత సర్వేలో తగిన ఏర్పాటు చేయాలని కుల నిర్మూలన సంఘం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సలహాదారులు సి.ఎల్.ఎస్.గాంధీ, అధ్యక్షులు యం.డి వహీద్, ప్రధాన కార్యదర్శి డి.ఎల్.కృష్ణచంద్‌లు మాట్లాడుతూ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సమూహంగా ఏ మతాన్ని, కులాన్ని పాటించని వారు ఉన్నారని వారు గుర్తుచేశారు.ప్రస్తుత కులగణనలో కులాంతర వివాహం చేసుకున్న వారి గూర్చి ఒక కాలం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని అదే తరహాలో కులం, మతం నమ్మని వారి గూర్చి కూడా ఒక కాలం ఇవ్వాలని సూచించారు.

'చరిత్రలో నిలిచినపోయిన అక్టోబర్ విప్లవం'

కాచిగూడ: అక్టోబర్ విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు బాసటగా నిలిచిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హిమాయత్‌నగర్ లోని సిపిఐ కార్యాలయంలో అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోవియట్ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారుల, భూస్వాముల గుండెల్లో ప్రకంపనలు సృష్టించిందన్నారు. ప్రపంచ పరిణామాల దశను, దిశను మార్చి ప్రపంచ మానవాళి చరిత్రను మలుపుతిప్పిన ఘటన అక్టోబర్ విప్లవమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్.బాలమల్లేష్, కేవియల్, పల్లె నరసింహ, రాపోలు సుదర్శన్, చంద్రమోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

ట్రాఫిక్ డీసీపీ ఎన్.అశోక్ కుమార్



కాచిగూడ: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీసీపీ ఎన్.అశోక్ కుమార్ సూచించారు. గురువారం బషీర్‌బాగ్ చౌరస్తాలో రాంగ్ రూట్ ప్రయాణం, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడంతోపాటు నిబంధనలు పాటించే వారికి గులాబీ పూలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణించే సమయంలో ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. చిన్నచిన్న తప్పిదాల వల్ల పెద్దస్థాయిలో మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మహ్మద్ మాజీద్, నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.